# ముళ్ళపంట

పుష్పలతను ఎవరు నాకు పరిచయం చేశారో గుర్తులేదు. ఆమెను మొదటిసారిగా రెండున్నర సంవత్సరాల కిందట మా ఆఫీసులో నా గదిలో చూశాను. అప్పటికి ఆమె వయసు ముప్పయి రెండు సంవత్సరాలు పయిగానే ఉండొచ్చు, సన్నగా, చామనచాయలో ఉంది.

కుర్చీ చూపించి, "కూర్చోమ్మా" అన్నాను.

ముందు కూర్చోడానికి తటపటాయించింది. మరోసారి నేను కూర్చోమనేసరికి కుర్చీ అంచున కూర్చుంది. ఆమె కళ్ళల్లో బెదురు కనిపిస్తోంది. వెంట వచ్చిన మనిషి ఆమె గురించి చెప్పబోతోంటే వారించి, "ఆమెనే చెప్పనివ్వు" అన్నాను. తన గురించి తను చెప్పుకుంటే భయం తగ్గుతుంది.

"నా భర్త పేరుప్రభాకర్. ఎలక్ట్రికల్ డిపార్టుమెంట్‌లో ఫిట్టరుగా పనిచేశాడు. ఆయన చనిపోయి సంవత్సరం దాటింది."అంది.

"ఆఫీసులోనే చనిపోయాడా?" అడిగాను.

"ఆఫీసులో కాదండీ. మన కంపెనీ జనరల్ ఆస్పత్రిలో చనిపోయాడు. ఆయనకు మూత్రపిండాల జబ్బు ఉంది. ప్రాణం మీదకి వచ్చేంతవరకు నాకూ చెప్పలేదు. ఆయన తాలూకు బీమా, ప్రావిడెంటు ఫండు, గ్రాట్యువిటీ అన్నీ వచ్చేశాయి. పెన్షన్ కూడా ఇస్తున్నారు. ప్రస్తుతం కంపెనీ క్వార్టర్‌లో ఉంటున్నాను. నేను ఇంటరు పూర్తి చేశాను. టైపింగ్ వచ్చు. కంప్యూటర్స్ ఆపరేట్ చేయగలను..." ఆగింది.

మాటలు వినిపించక పోయేసరికి తలెత్తి "చెప్పు" అన్నాను.

"మీరేదో ఫైలు చూసుకుంటున్నారు."

"చూస్తూ నీ మాటలు వింటున్నాను. ఫైలు మూసేసి నీ ముఖంలోకి చూస్తే నువ్విప్పుడు చెబుతున్నంత ఫ్రీగా చెప్పలేవు కదా?"

తలూపి నవ్వి తిరిగి చెప్పడం మొదలెట్టింది. "మన కంపెనీలో ఉద్యోగం చేద్దామని గత సంవత్సరం నుండి ప్రయత్నిస్తున్నాను. అదో, ఇదో అని తిప్పుతున్నారు. ఎవరూ ఏదీ చేయడంలేదు. సమస్య ఇది అవి చెప్పడం లేదు. పని కావడం లేదు. పర్సనల్ డిపార్టుమెంటులో లీలగారిని అడిగాను. ఆమె పాండురంగారావుగారిని అడగమన్నారు. ఆయన్ని అడిగాను. వెల్ఫేర్ సెంటర్ సెక్రటరీని అడగమన్నారు. ఒకటికాదు, రెండుసార్లు కాదు ఆమెను కలుద్దామని చాలాసార్లు వెళ్లాను. ఆమె దొరకదు. వెల్ఫేర్ సెంటర్ ద్వారా ఉద్యోగం వస్తుందో, లేదో నాకు తెలియడం లేదు. మాటి మాటికి అడుగుతోంటే అయ్యే పని అసలు కాదేమోనని భయం. ఏం చేయాలో తోచడం లేదు. మీరు తలుచుకుంటే పని అవుతుందని నిన్ననే నాకు తెలిసింది.. " అని చేతిలో ఉన్న ఫైల్లోంచి బయోడేటా తీసి నాకు ఇవ్వబోయింది.

"ఉంచు, అవసరమున్నప్పుడు అడిగి తీసుకుంటాను. పెన్షన్ ఎంతిస్తున్నారు?"

చెప్పింది.

"పిల్లలు ఎంతమంది?"

"లేరు, పుట్టలేరు"

"క్వార్టర్‌లో ఒక్కదానివే ఉంటున్నావా?"

"అప్పుడప్పుడు అమ్మవచ్చి వెళ్తుంటుంది."

"మీ అమ్మ వాళ్లు ఎక్కడుంటున్నారు?"

"కోలవెన్ను, కృష్ణాజిల్లా."

"మీ అమ్మగారు వచ్చి నీతో ఉండొచ్చు కదా?"

"రాదు. తను ఇక్కడకు వస్తే మా ఊళ్ళో నాన్నను చూడడానికి ఎవరూ ఉండరు. ఆయనకు కష్టమయిపోతుంది. నాన్న మా ఊళ్ళో టీచరుగా పనిచేస్తున్నారు."

"అన్నలుగానీ, తమ్ముళ్లుగానీ?"

"ఉన్నారు. తలా ఒక చోట ఉద్యోగాలు చేసుకుంటున్నారు."

"ఏమనుకోవద్దు. నాకు తెలియక అడుగుతున్నాను. నువ్వు మీ ఊరువెళ్ళినా నీకు పెన్షన్ వస్తుంది. ఒక్కదానివే ఇక్కడ ఎందుకు ఉండడం? నువ్వు తప్పకుండా ఉద్యోగం చేయాలా?"

ఆమె వెంటనే జవాబు చెప్పలేదు. నాప్రశ్న ఆమెకు నచ్చినట్టు నాకనిపించలేదు. చేతిగడియారం చూసుకుని, "మన వెల్‌ఫేర్ సెంటర్ నుండి నీకు ఉద్యోగం దొరికితే, మహా అయితే నీకు నెలకు మూడు వేలకంటే ఎక్కువ జీతం ఇవ్వరు. కంపాషనేట్

గ్రౌండ్స్‌లో నీకుపర్మనెంట్ ఉద్యోగం రాదు" అన్నాను.

"తెలుసండీ."

"ఇంకోమాట. తీరా నీకు నేను ఉద్యోగం ఇప్పించాక వారమో, పదిరోజులో, నెలో చేసి బాగా లేదని మానేస్తావా?"

తల అడ్డంగా ఆడించి, "మానేయనండీ, ఎంత కష్టమయినా పనిచేస్తాను" అంది.

పాండురంగారావుకు ఫోను చేసి, "ఒక క్యాండిడేట్‌ను పంపిస్తున్నాను" అన్నాను.

అతను నామాట తీసేయడు.

"పంపించు" అన్నాడు.

ఫోను పెట్టేసి పుష్పలత వంక చూసి, "వెళ్ళి పాండురంగారావుగారిని కలువు, ఆయన ఎక్కడ కూర్చుంటారో తెలుసుకదా?" అన్నాను.

"తెలుసండీ" అంది లేచి నిలబడుతూ.

గంట తర్వాత ఆమె ఫోను చేసి, "మీరు నాకు చాలా సహాయం చేశారు. మీ మేలు మర్చిపోలేను. చాలా థేంక్సండీ. వెంటనే ఉద్యోగంలో చేరిపోమ్మన్నారు" ఎంతో సంతోషంగా చెప్తోంటే నాకూ ఆనందం వేసింది. ఇంకొకరికి దారి చూపించ గలిగాను.

"ఎక్కడ వేశారు?" అడిగాను.

"క్వాలిటీ డిపార్టుమెంటులో వీరయ్యగారి దగ్గర కంప్యూటర్ అసిస్టెంట్‌గా వేశారు."

"వెరీగుడ్. ఆయన నాకు బాగా తెలుసు. మంచి వాడే. అవసరమనిపిస్తే నాకు ఫోను చేయి" అన్నాను.

ఆరునెలల వరకు రెండువారాల కొకసారో, మూడు వారాలకొకసారో నా గదికి వచ్చి అయిదు నిమిషాలపాటు కూర్చోడమో లేక ఫోనులో మాట్లాడడమో చేసేది. ఆ తర్వాత ఆమె రావడం, ఫోను చేయడం మానేసింది. నాకు ఇవన్నీ మామూలు విషయాలు. ఆమె రాకున్నా, మాట్లాడక పోయినా నేను పోగొట్టుకునేది ఏమీ ఉండదు. ఆమె ఉద్యోగం చేస్తోందో, మానేసి కోలవెన్ను వెళ్ళిపోయిందో తెలుసుకుందామని అనిపించలేదు. మీటింగుల్లో వీరయ్య నాలుగయిదు సార్లు కలిశాడు కానీ మర్చిపోయి ఆమె గురించి అడగలేదు.

రెండు సంవత్సరాలు గడిచాక ఒక సాయంత్రం పుష్పలత నాకు ఫోనుచేసింది. నాతో వేరే ఏదో అవసరం పడి ఉంటుంది.

"చెప్పమ్మా" అన్నాను.

"ఎలా ఉన్నారు?"

"బాగానే ఉన్నాను. చాలా రోజుల తర్వాత ఫోను చేశావు. అసలు ఆఫీసుకు వస్తున్నావా, ఉద్యోగం మానేశావా?"

"రెండు వారాల నుండి ఆఫీసుకు రావడం లేదు."

"ఇప్పుడు ఎక్కడ నుండి మాట్లాడుతున్నావు?"

"ఇంటి దగ్గర నుండి"

"ఆఫీసుకు ఎందుకు రావడం లేదు, వంట్లో బావుండడం లేదా?"

"అలాంటిదే..." ఆగి చిన్నగా దగ్గి, "....నేను.... కడుపుతో ఉన్నాను...." నెమ్మదిగా అంది.

ఆశ్చర్యంతో నాకు వెంటనే ఏం మాట్లాడాలో తోచలేదు. ఆమె మాటలో బాధ ధ్వనించలేదు. అతి సామాన్య విషయంలా చెప్పింది. ఇంతవరకు నాకు ఏ స్త్రీ అర్థం కాలేదు. లేదా, అర్థం చేసుకోవడం నాకు చేతనవలేదేమో!

"వీరయ్యగారు నా గురించి మీతో ఏమీ చెప్పలేదా?" అడిగింది.

"ఆయనతో మాట్లాడి చాలా రోజులయింది. నువ్వు మళ్ళీ పెళ్ళి చేసుకున్నావా?"

"లేదు."

పెన్షన్ తీసుకుంటున్న వితంతువులు పెళ్ళిచేసుకుంటే పెన్షన్ ఆగిపోతుంది. ఉద్యోగంలోంచి తీసేస్తారు. క్వార్టరు ఖాళీ చేయిస్తారు. ఈ విషయాలన్నీ పుష్పలతకు తెలిసే ఉండాలి. ఆమె గర్భవతని డిపార్టుమెంటులో తెలిసుండాలి.

"నాకు ఇప్పుడు ఆరోనెల."

"తొందరపడ్డావా?" అడిగాను.

"లేదండీ. నేనేం తొందర పడలేదు. ఈ విషయం మీకు ఎప్పుడో చెప్పి ఉండాల్సింది. ఇప్పుడు చెబుతున్నందుకు నామీద కోపం తెచ్చుకోకండి. నన్ను దయచేసి అర్థం చేసుకోండి. నాకు సంతానం కావాలి. ప్రభాకర్‌తో నేను ఎనిమిది సంవత్సరాలు కాపురం చేశాను. మనసులో ఏమీ దాచుకోకుండా చెబుతున్నాను. ఆయనతో ఒక్కనాడంటే ఒక్కనాడు కూడా నేను సుఖపడలేదు. నన్ను నేను సమర్థించుకోవడానికి మీతో అబద్ధం చెప్పడం లేదు. మరో సంవత్సరమో, రెండు సంవత్సరాలో గడిస్తే

నాకు ముప్పయి అయిదు సంవత్సరాలు నిండుతాయి. ఆ తర్వాత పిల్లలు పుట్టొచ్చు, పుట్టకపోవచ్చు. పుట్టినా ఏ అంగవైకల్యంతోనో పుట్టే అవకాశం ఉంది. పాపయినా, బాబయినా పరవాలేదు. నాకు తోడుగా ఉండి నన్ను చూసుకునేందుకు."

ఆమె మాటలు ఆవేశంగా ఉన్నాయి. ఆమెను తక్కువ అంచనా వేశాను. నేనెప్పుడూ ఆడవాళ్ళ దగ్గరే పొరబడుతుంటాను.

"పాపో, బాబో పెద్దయ్యాక నిన్ను చూస్తారని నమ్మకం ఏమిటి?"

"చూడకపోతే నేను మటుకు ఏం చేయగలను?"

మాటలో ఎటువంటి నిస్సహాయతా లేదు.

"ఎవరతను?"

"వెంకట్రావని లేబరు కాంట్రాక్ట్ సొసయిటీలో పని చేస్తుంటాడు."

"అతన్ని పెళ్ళి చేసుకోవచ్చు కదా?"

"అతనికి ఎప్పుడో పెళ్ళి అయింది. ఇద్దరు పిల్లలున్నారు. మా ఇద్దరి మధ్యా పెళ్ళిమాట ఎప్పుడూ రాలేదు."

"ఆర్థికంగా నీకేమయినా సహాయం చేస్తుంటాడా?"

"లేదు, పైపెచ్చు నాదగ్గర ప్రతినెలా ఎంతో కొంత తీసుకొంటాడు. నాకు మీరో సహాయం చేయాలని కోరుకుంటున్నాను."

"చెప్పు".

"నాలుగు నెలలపాటు జీతం నష్టంమీద నాకు సెలవు కావాలి".

"వీరయ్యగారిని అడగక పోయావా?"

"అడిగాను. ఆయనకు నామీద కోపంగా ఉంది. సెలవు ఇవ్వనన్నాడు."

"నువ్వు కడుపుతో ఉన్నట్లు ఆయనకు తెలుసా?"

"తెలుసు. నేనేచెప్పాను. చెప్పాకే నాతో మాట్లాడడం మానేశారు. ఈ విషయం పర్సనల్ డిపార్టుమెంటు లీలగారికి కూడా చెప్పారు. సెలవు గురించి లీలగారితో మాట్లాడితే ఉద్యోగానికి రాజీనామా చేయమన్నారు. చేయకపోతే ఉద్యోగం లోంచి తీసేస్తామన్నారు. సెలవు మంజూరు చేయించుకోకుండా వెళ్ళినా కూడా ఉద్యోగం లోంచి తీసేస్తారు. అప్లికేషన్ లీలగారి దగ్గర ఉంది. కాన్పు కోసమని సెలవని కాకుండా డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌లో బి.ఎ. చదువుకని అడిగాను. అయితే నిజం చాలా మందికి తెలుసనుకుంటాను. మీరు ఒకసారి వీరయ్యగారితోనో, పాండురంగారావు గారితోనో మాట్లాడితే నా సమస్యకు పరిష్కారం దొరుకుతుందని ఆశపడుతున్నాను.

ఇక ఏ విషయంలోనూ మీకు ఇబ్బంది కలిగించను . ఈ ఉద్యోగం పోగొట్టుకోవడం నాకు ఇష్టం లేదు.”

“మాట్లాడతాను” అని ఫోను పెట్టేశాను.

పాండురంగారావుతో మాట్లాడితే అతను అన్నాడు, “నాకు చేతనయినంత సహాయం చేస్తాను. నువ్వుచెప్పాక ఎలా కాదంటాను బాసూ?”

అరగంట తర్వాత అతనే ఫోనుచేసి, “పుష్పలత సెలవు మంజూరయింది. సెలవయిపోగానే వచ్చి ఉద్యోగంలో  చేరొచ్చు” అన్నాడు. ఆ సంగతి ఆమెకు ఫోనుచేసి చెప్పాను.

మూడు నెలల తర్వాత, ఉదయం ఎనిమిదిన్నరకు ఆఫీసుకు వచ్చి అలా సీట్లో కూర్చున్నానో లేదో, పుష్పలత నుండి ఫోను వచ్చింది, బొత్తిగా ఎదురుచూడనిది.

మర్యాద కోసం, “కంగ్రాచ్యులేషన్స్, అబ్బాయా, అమ్మాయా?” అడిగాను.

“థేంక్యూ.. అబ్బాయి ఈ ఉదయమే  చెన్నారెడ్డి ఆస్పత్రిలో కాన్పు అయింది.” చాలా సంతోషంగా అంది.

“సిజేరియనా?”

“కాదు. మామూలు కాన్పు”.

“నీకు తోడు ఎవరున్నారు?”

“మా అమ్మ ఊరునుండి వచ్చింది. కాన్పు అయ్యాక అందరి కంటే ముందు మీకే ఫోనుచేస్తున్నాను... మీరు నాకు ఎంతగానో సహాయం చేశారు... ” అంటోంటే ఆమె సెల్ కట్ అయినట్టుంది.

ఫోనుపెట్టేసి కొద్దిసేపు నా చేతిని రిసీవరు మీదుంచాను. ఎలా అయితేనేం, పుష్పలత పొల్లు పోకుండా, తను అనుకున్నది సాధించుకుంది. దుఃఖం ఆపుకోలేక పోతున్నాను. బయటకు వెళ్ళి  తనివితీరా ఏడుద్దామనిపిస్తోంది. నాకు ఇచ్చినట్లు ఇంకో తల్లి మరో బిడ్డకు జన్మనిచ్చింది. కుమిలి కుమిలి బతుకుతున్నాను. నాలా మరొకరు బాధపడకూడదు. వద్దంటే వద్దు.

❖ విపుల, మాసపత్రిక, జూన్ 2009